క్లుప్తంగా

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు



పటమట(విజయవాడతూర్పు): నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు తీసుకొంటామని సెంట్రల్ డివిజన్ ఏసీపీ భాస్కరరావు అన్నారు. పటమటలోని ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మందుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయికి అలవాటు పడిన పలువురు మందుల షాపుల్లో లభ్యమయ్యే ఆల్ప్రోజోమ్, డైజాప్టమ్, ట్రిమడాల్ వంటి వాటికోసం డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌లేకుండా తీసుకెళ్తున్నారని, ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎవరికీ మందులు విక్రయించవద్దన్నారు. సమావేశంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, పటమట సీఐ కాశీ విశ్వనాథ్, మాచవరం, గుణదల సీఐలు కృష్ణ మోహన్, గుణరాము పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి విశేష అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వరస్వామికి విశేష అభిషేకాలు చేశారు. అమావాస్య సోమవారం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారికి మహాన్యాస పూర్వక అభిషేకం, విజయదుర్గమ్మకు కుంకుమార్చన, చండీహోమం, చండీ పారాయణం జరిగాయి. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. అన్నదానానికి కనుమరులపూడి సుబ్బరత్నం కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త కనిపించడం లేదని భార్య కొత్తపేట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇస్లాంపేట అమ్మిశెట్టి వారి వీధికి చెందిన గోవాని కవిత, వికాసం భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం, వికాసం ఇంటి డెకరేషన్ పనులు చేస్తుంటాడు. కొంత కాలంగా అతను సొంతంగా వ్యాపారం చేస్తానంటూ భార్యను డబ్బులు అడుగుతున్నాడు. తన వద్ద లేవని, తెలిసిన వారిని అడిగినా లేకపోవడంతో అదే విషయాన్ని కవిత తన భర్తకు చెప్పింది. దీంతో ఆందోళన చెందిన వికాసం ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కవిత తన భర్త కనిపించడం లేదంటూ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఎస్‌ఎన్‌పురం పోలీసులు సోమవారం అరెస్టు చేసి 1.40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పైపులరోడ్డుకు చెందిన పోలిశెట్టి నాగకుమార్ ఇతర ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలోని కాల్‌టెక్స్‌రోడ్డు, బస్‌స్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్ఐ దుర్గామహేష్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగు సోదా చేయగా గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు.

కిటకిటలాడిన అంకమ్మతల్లి శక్తిపీఠం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నేతాజీ కాలనీలోని అంకమ్మతల్లి శక్తిపీఠం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, శ్రీచక్రార్చన చండీ హోమం జరిగింది. నగరానికి చెందిన భక్తురాలు కుమారి అంకమ్మ తల్లికి 10 గ్రాముల బంగారు సూత్రాలను సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించి బంగారు సూత్రాలను అలంకరించారు. ఎంతో మహిమాన్వితమైన కోరిన కోరికలు తీర్చే అమ్మవారికి తన వంతు బాధ్యతగా బంగారు సూత్రాలను అందజేసినట్లు భక్తురాలు కుమారి తెలిపారు.

వలంటీర్ వ్యవస్థపై ప్రజల్లో సంతృప్తి

- పవన్‌కల్యాణ్‌ది దుష్ప్రచారం
- జగనన్న సురక్షలో ఎమ్మెల్యే వెలంపల్లి



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థతో నేరుగా ప్రజల ముంగింటకే చేరుస్తుండటంతో వారు సంతృప్తి చెందుతున్నారని, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం వలంటీర్లను అవమానకరంగా మాట్లాడంపై వారే బుద్ధి చెబుతారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. 49, 50 డివిజన్లలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత 50వ డివిజన్‌లో కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఆధార్ మార్పులు వంటివి 1850 మంది లబ్ధిదారులకు, 49వ డివిజన్‌లోని 600 మంది లబ్ధిదారుల దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి 11 రకాల సేవలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అందుబాటులో లేని లబ్ధిదారులు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే అందజేస్తారని పేర్కొన్నారు.

175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము ఉందా?

40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు చెయ్యలేని పనులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు చేస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్ చంద్రబాబుకు కట్టు బానిస అన్నారు. పవన్, చంద్రబాబు, బీజేపీ చెట్టాపట్టాలేసుకుని తిరిగిన సమయంలో కూడా ప్రజలకు మంచి చెయ్యలేదని దుయ్యబట్టారు. వారాహిలో తిరుగుతూ ప్రభుత్వాన్ని విమర్శించడం కాదని, ప్రజల్లోకి వెళ్తే వలంటీర్లు చేస్తున్న సేవలు తెలుస్తాయని చెప్పారు. వలంటీర్ వ్యవస్థను అవమానపరిస్తే చూస్తు ఊరుకోబోమని ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము ఉందా అని పవన్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో 49, 50 డివిజన్ల కార్పొరేటర్లు బుల్లా విజయ్‌కుమార్, బోయి సత్యబాబు, వైఎస్సార్ సీపీ 50వ డివిజన్ ఇన్‌చార్జ్ బంక విజయ, 49వ డివిజన్ అధ్యక్షుడు గొడుపేరు సుధీర్, వీఎంసీ, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారాలు లభించాలి

మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): స్పందనలో వచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సూచించారు. వీఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో వీరు 21 ఫిర్యాదులను స్వీకరించి అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం-11, ఇంజినీరింగ్ విభాగం-4, రెవెన్యూ-1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)-2, ఎస్టేట్ విభాగం-1, అదనపు కమిషనర్ (జనరల్) విభాగం-2 వచ్చాయి. ఆయా సమస్యలను నిర్దుష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం 1902, స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను వీఎంసీ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయాల స్థాయిలో ఉన్న సమస్యలను సంబంధిత కార్యదర్శులు మాత్రమే పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులకు సంక్షేమాన్ని అందించడానికి వీఎంసీ పరిధిలో అన్ని సచివాలయాల కార్యదర్శులను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ సంబంధిత విభాగం అధికారి, సచివాలయ కార్యదర్శి నేరుగా ఫిర్యాదుదారుని కలిసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన వేదికలో అందించే ఫిర్యాదుల సంఖ్యను తగ్గించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పనితీరును మెరుగుపరచడానికి ఆకస్మిక తనిఖీలు చేయాలని కమిషనర్ సూచించారు. నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. సీఈ ఎం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్య కుమార్ పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి



రైల్వేట్రాక్ వద్ద తిరుగుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సురేష్‌రెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ పీఎస్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆర్.సురేష్‌రెడ్డి హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక శక్తులకు అవకాశం లేకుండా అక్రమ రవాణా, నిషేధిత పొగాకు, గంజాయి వంటి విక్రయాలకు, బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డుకట్ట వేసేందుకు వన్‌టౌన్ పోలీసులు సోమవారం సాయంత్రం విస్తృత సోదాలు చేశారు. సీఐ సురేష్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి తారాపేట, రైల్వేస్టేషన్ వెస్ట్ బుకింగ్ వైపు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై, నేరస్తుల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. స్థానికులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు శంకరరావు, రఘునాథ్, రమ్యశ్రీసత్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రాంతాలపై ప్రత్యేక నిఘా


చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నిర్మానుష్య ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఈబీ ఏడీసీపీ రామ్ ప్రసాద్ హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే అప్‌యార్డ్, జక్కంపూడి కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్లాట్లు, ఖాళీ ప్రాంతాలు, కాలనీ శివారు ప్రాంతాల్లో ఏడీసీపీ రామ్‌ప్రసాద్, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది సోమవారం ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహించారు. కాలనీలోని నిర్మానుష్య ప్రాంతాల్లో ఉన్న యువకులను తనిఖీ చేసిన పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రైతుబజార్‌లో కందిపప్పు విక్రయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని తగ్గించే దిశగా రైతు బజార్లలో బియ్యం, టమాటాతో పాటు కందిపప్పు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. విజయవాడ సాంబమూర్తి రోడ్డులోని రైతు బజారులో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ హోల్ సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ సొసైటీ సహకారంతో కందిపప్పు విక్రయ కౌంటర్‌ను జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. నాణ్యమైన దేశవాళీ కందిపప్పును కిలో రూ.135లకే విక్రయిస్తామని జేసీ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీపై నాణ్యమైన బియ్యం, టమాటా, కందిపప్పు వంటి సరుకులను ప్రజలకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సాంబమూర్తి రోడ్డు రైతు బజార్‌తోపాటు మిగిలిన రైతు బజార్లలో కూడా కౌంటర్లు ఏర్పాటు చేసి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కౌంటర్లలో కిలో టమాటా రూ.50, కిలో సోనా మసూరి బియ్యం రూ.49, కందిపప్పు రూ.135 చొప్పున విక్రయిస్తామని వివరించారు. డీఎస్ఓ మోహన్‌బాబు, ఏఎస్ఓలు సి.ధనుంజయరెడ్డి, శ్రీలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ మంగమ్మ, మహాత్మా గాంధీ హోల్ సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ సొసైటీ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, సెక్రటరీ కె నారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

తోకలు కత్తిరిస్తానన్న మాటలు మరిచారా?

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈనాడు పత్రిక వాస్తవాలను విస్మరించి, ప్రభుత్వంపై నిత్యం బురద చల్లటమే పనిగా పెట్టుకుందని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య విమర్శించారు. ముఖ్యంగా విజయవాడలోని దుర్గగుడిలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు జీఓ110 పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నా.. అసంతృప్తితో ఉన్నట్లు కథలు అల్లడం సరికాదన్నారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో భక్తుల నుంచి వసూలు చేసే తలనీలాలు రుసుమును రూ.15ల నుంచి రూ.25లకు పెంచిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాయీబ్రాహ్మణుల విజ్ఞప్తి మేరకు తలనీలాల రుసుమును రూ.25ల నుంచి రూ.40లకు పెంచుతూ జీఓ 110 విడుదల చేసిందని గుర్తు చేశారు. అయితే అది ఇంకా అమలు కావటం లేదనే సాకుతో టీడీపీకి చెందిన కొందరు గత ప్రభుత్వం అవలంబించిన విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేయటం వారి గొయ్యిని వారే తీసుకున్నట్లుందని ఎద్దేవా చేశారు.

అవమానాన్ని మరిచిపోకూడదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు కలిసి తమ ఇబ్బందులను చెప్పినప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీకు గుర్తింపు కార్డులు ఇవ్వటంతో పాటు నిర్ణీత వేతనం అందేలా చూస్తానని హామీ ఇచ్చారని యానాదయ్య గుర్తు చేశారు. అయితే ఉద్యోగులుగా గుర్తిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు ఈనాడు వక్రీకరించి రాసి నాయీబ్రాహ్మణుల్లో చీలిక తెస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ కష్టాలను చెప్పుకునేందుకు సచివాలయానికి వెళితే.. 'లోపలకు ఎవరు రానిచ్చారు.. అసలు మీకూ దేవాలయాలకు సంబంధం లేదు, ఎక్కువగా మాట్లాడితే గుడి మెట్లు ఎక్కనివ్వనని, తోకలు కత్తిరిస్తానని అవమానిస్తే కన్నీటి పర్యంతమై వెనుదిరిగిన వైనాన్ని దుర్గగుడిలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు మరిచిపోయారా అని ప్రశ్నించారు.

అంత స్తోమత ఉందా?

రాష్ట్రంలోని దేవాలయాల్లో పని చేసేవారి నుంచి రూ.5 కోట్లు వసూలు చేశారని ఈనాడు విషపు రాతలు రోతగా ఉన్నాయని పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే స్తోమత నాయీబ్రాహ్మణులకు ఉందా అని ప్రశ్నించారు. సీఎం జగన్ ప్రభుత్వం ఇచ్చిన చారిత్రాత్మకమైన జీఓ 110తో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో పని చేసే సుమారు 2వేలమందికి శాశ్వత పరిష్కారం లభించిందని, అందుకే దుర్గగుడి దగ్గర కేశఖండన శాల వద్ద, పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జరిగిన కృతజ్ఞత సభలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారని గుర్తు చేశారు.

విలక్షణ నటుడు రంగనాథ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రంగనాథ్ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్. రామకృష్ణప్రసాద్ అన్నారు. దుర్గాపురం అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలో సోమవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ప్రముఖ సినీ నటుడు, సాహితీవేత్త, దర్శకులు రంగనాథ్ 74 వ జయంతి నిర్వహించారు. రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. వసంతకుమార్ మాట్లాడుతూ సినీనటుడు రంగనాథ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సొసైటీ కార్యదర్శి రాము, పి.విల్సన్ రాజు, షఫీ, నాగ మల్లిక, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మెల్ మాత పుణ్యక్షేత్ర మహోత్సవం

పెనమలూరు: కానూరులో మౌంట్ కార్మెల్ మాత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం రాత్రి పరిశుద్ధ జపమాల ప్రార్థనలు ఫాదర్ బొల్లి జయరాజ్, ఫాదర్లు పృథ్వి, మందా ప్రదీప్, సలివేంద్ర శౌరి, దేవదానం చేశారు. భక్తులు కొవ్వొత్తులతో ప్రార్థనలో పాల్గొన్నారు. భక్తులకు దివ్య ప్రసాదం అందజేశారు. లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వంటగ్యాస్ సిలిండర్‌ను డెలివరీ చేసే సమయంలో బిల్లుపై ఉన్న ధరనే వినియోగదారులు చెల్లించాలని భవానీ గ్యాస్ ఏజెన్సీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ వి.లక్ష్మణ్ తెలిపారు. భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ భవానీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సోమవారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిలిండర్ తీసుకునే సమయంలో సిబ్బంది వద్ద ఉండే కాటాతో బండ బరువు చూసుకోవచ్చాన్నారు. సిలిండర్ వాషర్, వాల్వ్ లీకేజీలను తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 1906కు లేదా 99851-96242కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు గ్యాస్ సిలిండర్ డెలివరీ, వినియోగం, సేఫ్టీ విషయంలో అడిగిన ప్రశ్నలకు సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, సేవాసమితి సభ్యుల పర్యవేక్షణలో జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు లెక్కింపు జరుగుతుంది.

శ్రీవారి సన్నిధిలో అరుణాచలేశ్వర ట్రస్ట్ సభ్యులు



శ్రీవారు, వాసవీమాతను దర్శించుకున్న అరుణాచలేశ్వర నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం గొల్లపూడిలోని వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువై ఉన్న ఉత్తర ముఖ శ్రీవారిని, వాసవి మాతను అరుణాచలేశ్వర నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ (అరుణాచలం) సభ్యులుగా ఇటీవల నియమితులైన గొంట్ల మోహన్‌రావు, మద్దాలి శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, కె.అనిల్, దింటకుర్తి వీరరాఘవరావు, రత్నారావు దర్శించుకున్నారు. వారికి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం కమిటీ తరఫున కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలను ఇప్పించి సత్కరించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు జొన్నలగడ్డ శివప్రసాద్, కోశాధికారి నీలిశెట్టి చెన్నకేశవులు అరుణాచలేశ్వర నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ సభ్యులుగా విజయవాడకు చెందినవారు నియమితులు కావడం గర్వకారణంగా ఉందంటూ వారిని అభినందించారు. కార్యక్రమంలో వినయ్, వెంకన్న, రమేష్, శివాజి, సత్యనారాయణ, ఆదిశేష గుప్త తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



ఎండీడీటీఐ ప్రాంగణంలో మొక్క నాటుతున్న డాక్టర్ జయమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎండీడీటీఐ ప్రెసిడెంట్ డాక్టర్ జయమోహన్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యాన కృష్ణా కెనాల్‌లోని మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎండీడీటీఐ)లో ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టారు. జయమోహన్ సభ్యులతో కలసి ఎండీడీటీఐ పరిసరాలలో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ జీవవైద్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పాటు సమాజానికి అవసరమైన పోషకాహారం అందించడానికి మామిడి, జామ, అరటి, దానిమ్మ పండ్ల మొక్కలు నాటాలన్నారు. మొక్కలు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ, నేల కోత, సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి సహకరించండి

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ వినతి



సీఈఓ శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ (పీఎంఎఫ్ఎంఈ) పథకం ద్వారా విశ్వబ్రాహ్మణ మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్. శ్రీధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఫుడ్ వ్యాపార యూనిట్లు పెట్టుకునేందుకు జిల్లా హార్టికల్చర్ అధికారులు, అలాగే అవగాహన కల్పించేందుకు రిసోర్స్ పర్సన్స్ అన్ని మండలాల్లో అందుబాటులో ఉన్నారని, వారిని సంప్రదిస్తే తగిన సహాయ సహకారాలను అందిస్తారని చెప్పారు. పూర్తి ఉచితంగా ప్రాసెస్ చేసే ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని, ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం బ్యాంక్ రుణ సౌకర్యం ఉందని, అందులో 35 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిర్దేశించిన సమయంలోగా నాణ్యతా ప్రమాణాలతో ఆర్‌యూబీ పనులు పూర్తిచేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మధురానగర్ ఆర్‌యూబీ పునరుద్ధరణ సందర్భంగా కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ రవితేజ ప్రాజెక్టు ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత రైల్వేగేటు, గద్దే వెంకట్రామయ్య పార్కు నుంచి మధురానగర్ వైపు చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టు సంస్థ, అధికారులకు సూచనలు చేశారు. పనులకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. సాధ్యమైనంత వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేస్తామని కొన్ని సందర్భాల్లో మాత్రం అంతరాయం కలుగుతుందని తెలిపారు. వాహన చోదకులు అనువైన ఇతర రోడ్డు మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని సూచించారు.

నేటి నుంచి గుణదల మూడు బ్రిడ్జిలపై రాకపోకలు బంద్..

గుణదల రైల్వేట్రాక్ వద్ద నూతన మంచినీటి సరఫరా పైపులైను పనులు ప్రారంభించినందున గుణదల మూడు బ్రిడ్జిలపై రాక పోకలు మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి ట్రాఫిక్‌ను పప్పుల మిల్లు వైపు మళ్లింపు చేశామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడమే లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ పర్యటనలో సూపరిటెండింగ్ ఇంజినీర్ బి.నరసింహ మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాస్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.గుర్నాధం, అసిస్టెంట్ ఇంజినీర్, రవితేజ ప్రాజెక్టు ప్రతినిదులు, స్థానిక నాయకులు పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఉచిత ధ్యాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సూచించారు. ముత్యాలంపాడు గంగానమ్మ దేవాలయంలో హిమాలయ అమరగురు ఆర్య శ్రీ మహావతార్ బాబాజీ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.
శిక్షకులు అమన్ హనీ ఆలీఖాన్, భానుప్రకాష్ మాట్లాడుతూ ధ్యానం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియచేసేందుకు తాము ఉచిత ధ్యాన శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దత్తసాయి మందిరంలో నవగ్రహ హోమం

మధురానగర్(విజయవాడసెంట్రల్):పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం ఆషాఢ అమావాస్య సందర్భంగా నవగ్రహ హోమం, లక్ష్మీపతి గణపతి హోమం, విశేష అర్చనలు పూజలు జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో హోమాలు నిర్వహించారు. అలాగే బాబాకు ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీర మోహనరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు.